
రోగులు ఎక్కువ.. మంచాలు తక్కువ



ఆరోగ్య సమస్యలతో సర్వజనాసుపత్రిలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో చేరుతున్న చిన్నారుల సంఖ్య అధికంగా ఉంటోంది. ఇక్కడి వార్డులో 26 మంచాలు ఉండగా కొన్ని విరిగిపోయాయి. ప్రస్తుతం 43 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. 29 మంది జ్వరంతో బాధపడుతుండగా ఒకరు డెంగీ బారిన పడ్డారు. మిగతా 13 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. కొంత మందిని పోషక పునరావాస కేంద్రం (న్యూట్రిషనల్ రిహాబిలిటేషన్ సెంటర్)లో ఉంచి వైద్యులు వైద్యమందిస్తున్నారు. అనారోగ్యంతో ఎంతమంది వచ్చినా తిరిగి పంపించకుండా చేర్చుకుంటున్నామని ఆర్ఎంఓ రాంబాబు 'ఈనాడు'కు తెలిపారు. మాతాశిశు సంరక్షణ కేంద్ర భవనంపై మరో అంతస్తు నిర్మించి అదనపు మంచాలు ఏర్పాటు చేస్తే పిల్లలకు ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. – ఈనాడు, ఖమ్మం



బోర్డుపై నమోదైన ఇన్‌పేషంట్లు 43 మంది

సొంతింటి కల.. సాకారమయ్యేలా..!

ఈటీవీ, ఖమ్మం



ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మరో కీలక ముందడుగు పడింది. నిరుపేదల దశాబ్దాల సొంతింటి కల సాకారమయ్యేలా ప్రభుత్వ కార్యాచరణకు సమాయత్తమవుతోంది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపికకు ముహూర్తం ఖరారైంది. దసరా తర్వాత ఉభయ జిల్లాల్లో మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరగనుంది. తొలివిడతలో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి 3,500 మంది చొప్పున లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనుంది.

ఉభయ జిల్లాల్లో 35,000 మందికి గృహయోగం దక్కనుంది. వీటితోపాటు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని నిర్ణయించింది. నిర్మాణంలో ఉన్నవాటిని త్వరితగతిన పూర్తిచేసేలా ప్రణాళికలు రచిస్తోంది. రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో లక్షలాది మంది నిరుపేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రెండు పడక గదుల గృహాలు సైతం

గత ప్రభుత్వ హయాంలో నిర్మించి పంపిణీ నోచుకోని రెండు పడక గదుల ఇళ్లను సైతం లబ్ధిదారులకు అందించనున్నారు. ఖమ్మం జిల్లాలో 8,956 మంజూరవగా 5,523 గృహాలను ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించారు. మిగతా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 6,443 ఇళ్లు మంజూరవగా 2,008 గృహాలు పూర్తయ్యాయి. 1,164 ఇళ్లను లబ్ధిదారులకు అందించారు. మరో 844 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే నిర్మితమైన గృహాలను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు అందించనున్నారు. నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తిచేసి కేటాయించనున్నారు.

త్వరలో దరఖాస్తుల పరిశీలన

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆరు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల వారీగా దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి భద్రాద్రి జిల్లాలో 2,79,638, ఖమ్మం జిల్లాలో 2,24,600 దరఖాస్తులు అందాయి. ఈ పథకానికి సంబంధించి ప్రభుత్వం గతంలోనే కొన్ని మార్గదర్శకాలు వెలువరించింది. తొలుత సొంత జాగా కలిగిన ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షలు, ఇతరులకు రూ.5లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి అందిస్తామని ప్రకటించింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటికే కార్యాచరణ రూపొందించింది. దసరా నాటికి ఈ ప్రక్రియను కొలిక్కి తీసుకురావాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సర్కారు నుంచి ఆదేశాలందాయి. 'ప్రజాపాలన'లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లోనే ప్రారంభమవనుంది. అక్టోబరు 15 నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ప్రకటించారు. ఈమేరకు తొలుత లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేకంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. వార్డు, గ్రామ, పట్టణ, మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి కమిటీల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు స్థానం కల్పించనున్నారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తులను అనుసరించి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేయటంలో ఈ కమిటీలు కీలక పాత్ర పోషించనున్నాయి.

అక్రమాలకు ఆద్యులు అధికారులే..!

ఈటీవీ, ఖమ్మం

ఇంటి దొంగల గుట్టు కనిపెట్టడం అంత సులువు కాదనే సామెత ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పౌరసరఫరాల సంస్థ అధికారులకు అద్దినట్టే సరిపోతుంది. ఉభయ జిల్లాల్లోని వివిధ రైస్ మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలు సాగిస్తున్న దాడులు ఇందుకు ఊతమిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఏసీజన్‌లో అప్పగించిన ధాన్యాన్ని, అదే సీజన్‌లో మరాడించి మిల్లర్లు ప్రభుత్వానికి బియ్యం అందించాలి. అయితే పదుల సంఖ్యలో మిల్లర్లు కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను పక్కదారి పట్టించి, సర్కారుకు బురిడీ కొట్టించినా తమకేమీ పట్టనట్టు పౌరసరఫరాల సంస్థ అధికారులు వ్యవహరించటం చర్చనీయాంశంగా మారింది. మిల్లర్ల అక్రమాలకు అధికారులు వంతపాడినట్లు టాస్క్‌ఫోర్స్ బృందాల దాడుల్లో తేటతెల్లమవుతోంది. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు ఆరు మిల్లుల్లో సుమారు రూ.300 కోట్ల అక్రమాలు జరిగినట్లు టాస్క్‌ఫోర్స్ బృందాలు గుర్తించినట్లు తెలిసింది.



కొణిజర్ల మండలంలోని ఓ రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు (పాత చిత్రం)

■ 'రూ.లక్షలకు లక్షలు అధికారులకు ముట్టజెప్పాం. చూసీచూడనట్లు వదిలేస్తామని మాట ఇచ్చి మళ్లీ ఈ దాడులు జరపటమేంటి' అని టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఖమ్మం జిల్లాలోని ఓ రైస్ మిల్లు నిర్వాహకులు ప్రశ్నించటం చర్చనీయాంశమైంది.

■ ఖమ్మం జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ నుంచి రూ.కోటి వసూలు చేసి అధికారులకు ముట్టజెప్పామని మరికొందరు మిల్లర్లు చెబుతుండటం గమనార్హం.

■ సీఎంఆర్ వ్యవహారంలో తమకు అనుకూలంగా ఉండేందుకు ఓ అధికారికి రూ.50 లక్షలు ముట్టజెప్పామని ఓ రైస్‌మిల్లు నిర్వాహకులు చెప్పటంతో టాస్క్‌ఫోర్స్ బృందం విస్తుపోయింది.

రూ.కోట్లలో ముడుపులు

రూ.కోట్లలో ముడుపులు తీసుకున్నందుకే ధాన్యం బయటకు తరలినా, సీఎంఆర్ ఇవ్వకున్నా పౌరసరఫరాల సంస్థ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ముడుపుల రూపంలో ఇచ్చిన రూ.కోట్లు పోయి క్రిమినల్ కేసుల పాలవుతుండటంతో మిల్లర్ల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.

ధాన్యం తీసుకొని.. బియ్యం అమ్ముకొని..

2023-24 వానాకాలానికి సంబంధించి ఖమ్మం జిల్లాలోని 66 మిల్లులకు 1,20,533.28 క్వింటాళ్ల ధాన్యాన్ని ప్రభుత్వం అప్పగించింది. మిల్లర్లు 80,903.06 క్వింటాళ్ల బియ్యం తిరిగి అప్పగించాల్సి ఉండగా 50,097.57 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. కనీసం 50 శాతం సీఎంఆర్ ఇవ్వని మిల్లులు 20 వరకు ఉన్నాయి. ఇంకొన్ని 10 శాతం సీఎంఆర్ కూడా అప్పగించలేదు. నిబంధనల ప్రకారం బియ్యం అప్పగించకపోతే కనీసం అందుకు తగిన ధాన్యం నిల్వలైనా మిల్లుల్లో ఉండాలి. ఆమేరకు టాస్క్‌ఫోర్స్ తనిఖీల్లో ధాన్యం నిల్వలు కనిపించకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని మిల్లర్లు తీసుకొని మరపట్టిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకొని సీఎంఆర్ ఎగ్గొట్టినట్లు సమాచారం.

కలెక్టర్ ఆగ్రహం..!

నిబంధనల ప్రకారం మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుంటే మీరేం చేస్తున్నారని పౌరసరఫరాల సంస్థ అధికారులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రశ్నించారు. వారానికోసారైనా మిల్లులను ఎందుకు పరిశీలించలేదని మండిపడ్డారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష జరిపారు. పౌరసరఫరాల సంస్థ అధికారుల నిర్లక్ష్యం వల్లే సీఎంఆర్‌ను మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు స్పష్టమవుతోందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.

సీఎంఆర్ అప్పగించని రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటున్నాం. ఒక మిల్లుపై కేసు పెట్టాం. మరో రెండు మిల్లుల అంశం కోర్టు పరిధిలో ఉంది. అధికారులపై ఆరోపణలు వాస్తవమని తేలితే చర్యలు తప్పవు.
– మధుసూదన్‌నాయక్, అదనపు కలెక్టర్, ఖమ్మం

వరద బాధిత రైతులకు ఉపశమనం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

వరద బాధితులకు ఉపశమనం కలగనుంది. గత 30 రోజుల వ్యవధిలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. పశువులు, ఇతర జంతువులు సైతం మృత్యువాతపడ్డాయి. ఈక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ మండల పరిషత్ అధికారులతో కలిసి సర్వే నిర్వహించింది. కేంద్ర ప్రభుత్వ జాతీయ విపత్తుల నివారణ సంస్థ నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు పంపింది. ఫలితంగా రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాకు రూ.98.39 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని త్వరలోనే తహసీల్దార్ల ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేస్తారని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ బి.వేణుమనోహర్ తెలిపారు.

☆ వాస్తవంగా చనిపోయిన వాటి సంఖ్య చాలా ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం నిబంధనల ప్రకారం నష్టపరిహారం మంజూరు చేసింది. పశువులు ఎన్ని చనిపోయినా బాధిత రైతుకు రూ.1.50లక్షల చొప్పున మంజూరు చేస్తారు. అదే విధంగా మేకలు, గొర్రెలకు 30 శాల్తీలకు ఒక్కో దానికి రూ.5 వేల చొప్పున, కోడికి రూ.100 చొప్పున 10 వేల కోళ్లకు చెల్లిస్తారు. రైతుల కష్టం పూడ్చలేనిదైనప్పటికీ నిబంధనల ప్రకారం మంజూరు చేసిన నిధులతో కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంటుంది.

పేరు	సంఖ్య
ఆవులు	54
దూడలు	14
గేదెలు	87
గొర్రెలు	147
మేకలు	270
పందులు	30
కోళ్లు	2,746
మొత్తం	3,348



మృత్యువాతపడ్డ కోళ్లు (పాత చిత్రం)

3.50 కోట్ల చేపపిల్లలు పంపిణీ చేస్తాం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ ఏడాది 3.50కోట్ల చేపపిల్లలను పంపిణీ చేస్తామని మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ రెండు రోజుల క్రితం ముగిసిందన్నారు. టెండర్లు తెరిచి గుత్తేదారులను ఎంపికచేశామని చెప్పారు. 'న్యూస్‌టుడే'తో శుక్రవారం ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..



జిల్లా మత్స్యశాఖ అధికారి జి.శివప్రసాద్‌తో ముఖాముఖి

ఈనెలాఖరు నుంచి చెరువుల్లో వదులుతాం

గతేడాది 3.50కోట్ల చేపపిల్లలు పంపిణీ చేయాలనుకున్నా 59 లక్షలు మాత్రమే అందజేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావటంతో పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. ఈ సంవత్సరమూ 3.50కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వీటిని ఈనెలాఖరు నుంచి నాలుగు జలాశయాలతో పాటు 876 చెరువుల్లో వదులుతాం. ప్రమాదవశాత్తు మత్స్యకారులు చనిపోతే బాధిత కుటుంబానికి రూ.5లక్షల వరకు ప్రభుత్వం.. బీమా సౌకర్యం కల్పిస్తోంది. జిల్లాలో ఇలాంటి కేసులు ఆరు మాత్రమే పెండింగులో ఉన్నాయి. జిల్లాకు 59 చేపల చెరువులు, 25 చేపపిల్లల ఉత్పత్తి యూనిట్లు, మూడు రీసైక్లింగ్ అక్వాకల్చర్ యూనిట్లు అవసరమని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాం.

పీఎం మత్స్యయోజనతో ప్రోత్సాహం

ప్రధానమంత్రి మత్స్యయోజన ద్వారా చేపల చెరువుల్లో పిల్లల పెంపకానికి, నర్సరీల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహమందిస్తుంది. 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించి 14 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని త్వరలో ఎంపిక చేస్తాం.

పాలేరు జలాశయానికి 'సాగర్' జలాలు

కూసుమంచి, న్యూస్‌టుడే

నాగార్జున సాగర్ జలాలు శుక్రవారం తెల్లవారుజాము నుంచి పాలేరు జలాశయానికి చేరుతున్నాయి. ఈ నెల 1న భారీ వరదల నేపథ్యంలో సాగర్ ఎడమ కాల్వ మొదటి జోన్ పరిధిలోని సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని కాగిత రామచంద్రాపురం (132 కిమీ) వద్ద, ఖమ్మం జిల్లా పరిధిలోని కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెంకు ఎగువన (133.500 కి.మీ.) వద్ద భారీ గండ్లు పడిన విషయం తెలిసిందే. వీటి పూడ్చివేత, నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో నీరు దిగువకు రాకుండా 128వ కిలోమీటరు వద్ద అడ్డుకట్ట వేసి అక్కడి వరకు కొద్ది రోజులపాటు నీటిని వినియోగించుకున్నారు. గండ్ల నిర్మాణాలు పూర్తయిన నేపథ్యంలో అడ్డుకట్ట తొలగించడంతో 1,060 క్యూసెక్కుల నీరు పాలేరు జలాశయానికి చేరుతోంది.



ఎడమ కాల్వ మొదటి జోన్ నుంచి చేరుతున్న సాగర్ జలాలు

- ☆ పాలేరు జలాశయం నీటిమట్టం: 23 అడుగులు
- ☆ ప్రస్తుత నీటిమట్టం: 18.75 అడుగులు
- ☆ నీటి నిల్వ సామర్థ్యం: 2.558 టీఎంసీలు
- ☆ ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు: 1.843 టీఎంసీలు
- ☆ సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీటి చేరిక: 1,060 క్యూసెక్కులు
- ☆ పాలేరు ఏటి ద్వారా వరద నీటి చేరిక: 2,026 క్యూసెక్కులు
- ☆ పాలేరు నుంచి చిన్న కాల్వకు నీటి విడుదల: 120 క్యూసెక్కులు
- ☆ సాగర్ ఎడమ కాల్వ రెండో జోన్‌కు నీటి విడుదల: 2,810 క్యూసెక్కులు
- ☆ మిషన్ భగీరథ పథకాలకు : 135 క్యూసెక్కులు

30న ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం విద్యావిభాగం: 2008 డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశం లభించని అభ్యర్థుల్లో అర్హులైన వారిని ఒప్పంద పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరిలో 128 మంది బీఈడీ(మైదాన ప్రాంత), 215(ఏజెన్సీ ప్రాంత) అభ్యర్థుల నియామకానికి ఈనెల 30న ఉదయం 9.30 గంటలకు ఖమ్మం ట్రంకురోడ్డులోని పాత డీఈఓ కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డీఈఓ సోమశేఖరశర్మ శుక్రవారం ప్రకటించారు. సంబంధిత అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు ఒక ప్రతి ధ్రువీకరించిన నకలుతో హాజరుకావాలని సూచించారు. అభ్యర్థుల వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

29 నుంచి జిల్లా స్థాయి క్రీడాపోటీలు

ఖమ్మం క్రీడలు: జిల్లా స్థాయి పాఠశాల క్రీడలను ఆదివారం నుంచి అక్టోబరు 1 వరకు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి నర్సింహమూర్తి శుక్రవారం తెలిపారు. 29న అండర్ 14, 17 బాలురు, బాలికలకు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు ఉంటాయని, 30న కూసుమంచి, మధిర, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నార్త్, సౌత్‌జోనల్ జట్లకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో అంశాల్లో బాలికలకు పోటీలు ఉంటాయని, ఇవే అంశాల్లో 1న బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి వివరించారు.

నేడు డీసీసీబీ జనరల్‌బాడీ సమావేశం

ఖమ్మం గాంధీచౌక్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) జనరల్‌బాడీ సమావేశం ఖమ్మంలోని ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించనున్నట్లు బ్యాంకు ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకుకు సంబంధించిన వివిధ అంశాలను చర్చిస్తామన్నారు.

మాజీ సీఎం జగన్ తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాల్సిందే: మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ఖమ్మం నగరం: ఏపీ మాజీ సీఎం జగన్ తిరుమలలో ప్రవేశించేందుకు డిక్లరేషన్ ఇవ్వాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. దళితులను తిరుమలలోకి అనుమతిస్తారని, అనవసరంగా కులాల అంశాన్ని జగన్ తెరపైకి తెచ్చి రెచ్చగొట్టాలనుకోవటం సరికాదని హితవుపలికారు. ఖమ్మంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. తిరుమలలో డిక్లరేషన్‌పై సంతకం చేస్తే చర్చి ఫాదర్లు అభ్యంతరం చెబుతారని, విదేశీ సంస్థల నుంచి ఆర్థిక సాయం నిలిచిపోతుందని జగన్‌మోహన్‌రెడ్డి ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. అన్యమతస్థులు డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. జగన్ పాలనలో తిరుమలలో లడ్డూ ప్రసాదంలో కల్తీ అంశంపై హిందూ సమాజం ప్రశ్నిస్తుందన్నారు. సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు. డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సి వస్తుందనే భయంతోనే ఆయన తిరుమల పర్యటన వాయిదా వేసుకున్నారని ఎద్దేవాచేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసాల్లో ఈడీ సోదాలకు భాజపాకు సంబంధం లేదని తెలిపారు. విదేశాల్లో తీసుకున్న రుణాలు, కుమారుడు కొనుగోలు చేసిన చేతి గడియారం లెక్కల వివరాలను ఈడీ అధికారులకు చెబితే సరిపోతుందన్నారు. మద్యం గొలుసు దుకాణాలు తొలగిస్తామని ఇచ్చిన హామీని విస్మరించి అర్ధరాత్రి దాటేవరకు మద్యం విక్రయించేందుకు అనువుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయటం తగదన్నారు. కాంగ్రెస్, భారాసలు నాణేనికి బొమ్మ, బొరుసు లాంటివని, రెండు పార్టీలకు ప్రజల ఆరోగ్యం పట్టదన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ,నున్నా రవికుమార్, దొంగల సత్యనారాయణ, అల్లిక అంజయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

నేడు జాతీయ లోక్ అదాలత్

ఖమ్మం న్యాయవిభాగం: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లాలో మెగా లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించనున్నారు. రెగ్యులర్ కోర్టుల్లోని పెండింగ్ కేసులతోపాటు ప్రీ-లిటిగేషన్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించనున్నారు. జిల్లా న్యాయసేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. శనివారం ఉదయం 10.15 గంటలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఖమ్మం న్యాయసేవాసదన్‌లో లోక్ అదాలత్‌ను ప్రారంభించనున్నారు.

పువ్వాడ అజయ్ పిటిషన్ కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: 2014లో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ తనపై నమోదైన కేసును కొట్టివేయాలన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం, క్రికెట్ కిట్లు పంపిణీ చేస్తున్నారంటూ అజయ్‌పై 2014 ఏప్రిల్ 28న ఖానాపురం హవేలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ 2014లో హైకోర్టును ఆయన ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ క్రికెట్ కిట్ల పంపిణీతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. వసతిగృహంలో స్వాధీనపరచుకున్న కిట్లు తనకు చెందినవని తప్పుడు ఆరోపణలతో ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఫిర్యాదులోని అంశాలు విచారణలో తేలాల్సిందేనంటూ పువ్వాడ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉత్తర్వులిచ్చారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి: కలెక్టర్



కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

ఖమ్మం సంక్షేమవిభాగం: మహనీయుల అడుగుజాడల్లో యువత నడవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. తొలి, మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం ఎన్ని కష్టాలు వచ్చినా 40 ఏళ్ల పాటు ఉద్యమపంథాను ఆయన వీడలేదన్నారు. బీసీ సంక్షేమాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మధుసూదన్ నాయక్, జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి జి.జ్యోతి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, చిలకమర్రి శ్రీనివాస్‌బాబు, అమరగాని వెంకటేశ్వర్లు, తాటి శ్రీనివాస్, జనార్దన్, శ్రీను, రామ్మూర్తి పాల్గొన్నారు.

వరద బాధితుల పునరావాసానికి ప్రణాళికలు

ఖమ్మం నగరం: వరద బాధితుల పునరావాసానికి ప్రణాళికలు రూపొందించి అమలుచేయనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శుక్రవారం డియోసెసస్ సోషల్ సర్వీసెస్ సొసైటీ ఫాదర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద బాధితులు కోల్పోయిన ధ్రువపత్రాలు త్వరగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, సొసైటీ ఫాదర్ సురేశ్, అమల్ ఫాదర్ సెల్విన్, తప్పెట శౌరి, సుధాకర్, జయరాజు, ఐసక్, ఛార్లెస్, మదర్ థెరిస్సా సిస్టర్స్ పాల్గొన్నారు.

బౌద్ధ స్తూపం సందర్శన

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని బౌద్ధ మహాస్తూపాన్ని జడ్పీ సీఈవో దీక్షారైనా శుక్రవారం సందర్శించారు. స్తూప పరిసరాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ యర్రయ్య, జిల్లా పర్యాటకాధికారి సుమన్‌చక్రవర్తి, కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చారిత్రక వంతెనలు.. నిర్లక్ష్యానికి ప్రతీకలు..!



ఖమ్మం కాల్వొడ్డు వంతెనపై మొలిచిన మొక్కలు



వైరా జలాశయం ఆనకట్టపై మొలిచిన మొక్కలు



కాల్వొడ్డు వంతెనపై పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన గోడలు

ఇటీవల మున్నేరు మహోగ్రరూపం దాల్చినప్పుడు పరీవాహక ప్రాంతమంతా అతలాకుతలమైంది. 128 ఏళ్ల కాల్వొడ్డు వంతెన మాత్రం చెక్కుచెదరలేదు. అయితే ఈ వంతెనకు రెండువైపులా మొక్కలు పెరుగుతున్నాయి. పక్క గోడలు పెచ్చులూడి ప్రమాదకరంగా మారుతున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తేనే వంతెన పటిష్ఠంగా ఉంటుందని పలువురు స్థానికులు చెబుతున్నారు. ఈ అంశంపై ఆర్‌అండ్‌బీ డీఈ చంద్రశేఖర్ 'ఈనాడు'తో మాట్లాడుతూ రాగి, మర్రి మొక్కల వేర్లు బండరాళ్ల లోపలికి వెళ్లాయన్నారు. వాటిని పూర్తిస్థాయిలో తొలగిస్తే రాళ్లు కదిలే అవకాశముందని తెలిపారు. మూడు నెలలకోసారి మొక్కలను తొలగిస్తున్నామని చెప్పారు. పెచ్చులూడిన సైడ్ వాల్స్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన వైరా జలాశయం ఆనకట్ట సైతం నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆనకట్ట లోపలి భాగంలో మొక్కలు మొలుస్తున్నాయి. వీటిని తొలగిస్తామని నీటిపారుదలశాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు.

– ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, వైరా

రూ.81.40 లక్షలకు వ్యాపారి ఐపీ దాఖలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన తోడేటి వెంకన్న రూ.81,40,000కు ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం ఐపీ దాఖలు చేశాడు. మొత్తం 52మంది రుణదాతలను ప్రతివాదులుగా చేర్చాడు. కేసు వివరాల ప్రకారం.. మొదట ఆటో నడుపుతూ జీవనం సాగించే పిటిషనర్ వెంకన్న అనంతరం సమీప గ్రామాల్లో దుస్తుల వ్యాపారం చేశాడు. ఈ రెండింట్లో వచ్చిన ఆదాయంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆరంభించాడు. ఇందుకోసం అప్పులు తీసుకున్నాడు. కొవిడ్‌తోపాటు అనారోగ్య కారణాలతో వ్యాపారంలో నష్టాలు వచ్చి బాకీలు తీర్చే పరిస్థితి లేదని, తనను దివాలాదారుగా ప్రకటించాలని పేర్కొంటూ కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

కాటేస్తే చేటు.. జాగ్రత్తలే మేలు!

ఉభయ జిల్లాల్లో పెరుగుతున్న రేబిస్ వ్యాధి కేసులు



కరిచింది కుక్కే కదా? అని కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అది మంచిదైనా, పెంచుకునేదైనా? టీకాలు వేయించుకోవడం తప్పనిసరి అన్నది వైద్య నిపుణుల సూచన. దురదృష్టం కొద్దీ రేబిస్ సోకితే.. అది ప్రాణానికే ముప్పు. నేడు 'ప్రపంచ రేబిస్ దినం'.

ఖమ్మం వ్యవసాయం, కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

కుక్కలు, నక్కలు, తోడేళ్లు, కోతులు, గబ్బిలాల వంటి వాటి ద్వారా మనుషులకు సోకే.. ముందస్తు నివారణ తప్ప చికిత్స లేని వ్యాధి 'రేబిస్'. వ్యాధి సోకిన వ్యక్తులు, జంతువులు భిన్న ప్రవర్తనతో, విచక్షణ రహితంగా దాడి చేసే స్వభావం కలిగి ఉంటారు. ఆపై పక్షవాతం, నాడీ వ్యవస్థ నిర్వీర్యం ద్వారా ప్రాణాపాయం సంభవిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

సంతతి నియంత్రణ.. వ్యాక్సినేషన్


ఖమ్మం జిల్లాలో 7,500 వీధి, 22,000 పెంపుడు కుక్కలున్నాయని అంచనా. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు 5,000 వీధి శునకాలను గుర్తించారు. వీటిల్లో 3 వేల కుక్కలకు సంతతి నియంత్రణ శస్త్రచికిత్స, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ చేశారు. ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాల్లో కలిపి 20,918 మంది కుక్కకాటుకు చికిత్స పొందడం విశేషం. ఉమ్మడి జిల్లాలో ఈ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో అన్ని పశువైద్యశాలల్లోనూ రేబిస్ టీకాలు సిద్ధంగా ఉంచుతున్నారు. ఖమ్మం, కొత్తగూడెంలలో ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాలు కొనసాగుతున్నాయి. ప్రతి స్థానిక సంస్థ పరిధిలో వీధి కుక్కల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ కొన్నాళ్లుగా వినిపిస్తోంది.

కుక్కలు కనిపించినా.. కరిచినా.. ఇలా చేయండి

ఉమ్మడి జిల్లాలో రేబిస్ వ్యాధి ఎక్కువగా కుక్కకాటు ద్వారా వ్యాపిస్తోందని వైద్యులు తెల్పారు. ఎప్పుడైనా వీధిలో శునకం తారసపడితే కంగారు చెందొద్దు. భయంతో దాని కళ్లల్లోకి నేరుగా చూడొద్దు. అక్కడనుంచి నెమ్మదిగా నడకను సాగించాలి. కంగారుతో రాళ్లు విసరడం వంటివి చేయొద్దు. వీధికుక్కలైతే ఆహారాన్ని దగ్గర్లోంచి అందించొద్దు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపొద్దు. ఎక్కడైనా పిచ్చి ఎక్కినవి తారసపడితే వెంటనే పురపాలక, స్థానిక సంస్థల అధికారులకు తెలపాలి. వాటి విస్తరణను తొక్కిపెట్టేందుకు ఇబ్బందేనని గమనించాలి. ఒకవేళ కుక్కకాటుకు గురైతే ఆ గాయాన్ని కార్బాలిక్ యాసిడ్ సబ్బుతో పంపు కింద బాగా కడగాలి. ఆ తర్వాత సమీప పశువైద్యశాల, ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ టీకాలు తీసుకోవాలి.

తగిన జాగ్రత్తలు అవసరం

- డా.బి.వేణుమనోహర్‌రావు, జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ, ఖమ్మం



'రేబిస్' వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం. ఈ క్రమంలో ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని కళాశాలలు, విద్యాసంస్థల్లో నేడు (శనివారం) విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నాం. కుక్కలైనా, కోతులైనా మానవుల తప్పిదాలవల్లే జనావాసాల్లోకి వస్తున్నాయి. వాటి కాటుకు గురవకుండా జాగ్రత్తపడటం మేలు.

శిక్షణ శిబిరం సందర్శన

చంద్రుగొండ: మండలంలోని మంచినీటి సహాయకులకు ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ పరిశీలించారు. పంచాయతీల్లో తలెత్తే చిన్న చిన్న మరమ్మతులను స్థానికంగానే సరిచేసేందుకు ఈ సహాయకులకు ఇస్తున్న శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ శిబిరాన్ని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ కె.శ్రీనివాస్ సందర్శించారు. శిబిర బ్రోచర్‌ను విడుదల చేశారు. మిషన్ భగీరథ కొత్తగూడెం డీఈ శివయ్య, ఎంపీడీవో అశోక్, ఏఈలు హరికృష్ణ, సాయికృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ సాహితీ సదస్సుకు ప్రభాకరాచార్యులు ఎంపిక



అశ్వారావుపేట: ఖతార్ దేశం దోహాలోని ఎంఇఎస్‌పీపీ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నవంబరు 22, 23న జరిగే సాహితీ సదస్సుకు అశ్వారావుపేటకు చెందిన సినారె పురస్కార గ్రహీత సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు ఎంపికయ్యారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఆంధ్రా కళావేదిక ఖతార్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు తొమ్మిదో సాహితీ సదస్సులో ఆయన పాల్గొనున్నారు. 'తెలుగు సాహితీవనంలో వ్యంజకాలు' అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నట్లు ప్రభాకరాచార్యులు తెలిపారు. ఆయన ఎంపికపై భానూదయ సాహితీ సంస్థ గౌరవాధ్యక్షుడు ఎన్.రవి, కార్యదర్శి రామారావు, మడిపల్లి వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఎస్‌బీఐలో చోరీకి యత్నం

మధిర, న్యూస్‌టుడే: మధిర పట్టణంలోని వైరా రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ సిరిపురం బ్రాంచిలో గురువారం రాత్రి దుండగులు చోరీకి ప్రయత్నించి విఫలమయ్యారు. శుక్రవారం బ్యాంకుకు వచ్చిన మేనేజర్ ఉమేష్‌కుమార్ యాదవ్, సిబ్బంది విషయం గ్రహించి పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టణ ఎస్సై సంధ్య, సిబ్బందితో వచ్చి బ్యాంకును పరిశీలించారు. వైరా ఏసీపీ రెహ్మాన్ కూడా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు వెనక వైపు తాళాలు పగులగొట్టి దుండగులు లోపలికి వచ్చారని, లాకర్లను బ్రేక్ చేసేందుకు ప్రయత్నించి విఫలమైనట్టు వివరించారు. అలారం మోగటంతో చోరులు పారిపోయినట్టు తెలిపారు. వివరాల సేకరణ తర్వాత ఎలాంటి నగదు, ఆభరణాలు అపహరణకు గురికాలేదని మేనేజర్ నిర్ధారించారు. ఏసీపీ క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్‌బీఐ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంధ్య తెలిపారు.

నీటిని తోడేందుకు మరో నాలుగు మోటార్లు



నాగార్జున సాగర్ ఎడమ కాల్వపై తొలగించిన యూటీ సమీపంలో నీటిని తోడేందుకు యంత్రాంగం శుక్రవారం మరో నాలుగు మోటార్లను ఏర్పాటు చేసింది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం పర్యటనలో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న నాలుగు మోటార్లకు తోడు మరో నాలుగు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎనిమిది మోటార్లు రేయింబవళ్లు పనిచేస్తూ 120 క్యూసెక్కుల నీటిని యూటీ బయట ప్రాంతం నుంచి కాల్వలో తోడేస్తున్నాయి. దీంతో పొలాల్లో నిల్చిన నీటి పరిమాణం భారీగా తగ్గింది.

– కూసుమంచి, న్యూస్‌టుడే

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ టూరిజం క్లబ్ ఏర్పాటు



క్లబ్ లోగో ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ మహ్మద్ జకీరుల్లా, వీరన్న, రమాసత్యవతి, ఎంవీ రమణ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఖమ్మం ఎస్‌ఆర్అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువ టూరిజం క్లబ్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా ప్రారంభించారు. అనంతరం క్లబ్ లోగోను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువతలో టూరిజం, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించటం కోసం క్లబ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంవీ రమణ, ఐక్యూఏసీ పరీక్షల కంట్రోలర్ డాక్టర్ రమా సత్యవతి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.వీరన్న పాల్గొన్నారు.

భద్రాచలాన్ని పరిశుభ్రంగా ఉంచండి: పీఓ



పంచాయతీ కార్మికులకు భద్రత, కాస్మొటిక్ వస్తువుల కిట్ పంపిణీ చేస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం పట్టణం: భద్రాచలంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉన్నాయని, ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భద్రాచలానికి భక్తులు, వీఐపీలు వస్తుంటారని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. తడి, పొడి చెత్త వేరుచేసేందుకు డంపింగ్ యార్డుకు తరలించాలని తెలిపారు. కార్మికులకు భద్రతా పరికరాలు, కాస్మొటిక్ వస్తువులు పీఓ పంపిణీ చేశారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, పంచాయతీ ఈఓ సీహెచ్ శ్రీనివాసరావు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ: ఐఐటీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గురుకులం పూర్వ విద్యార్థి బూక్యా సునీల్‌కుమార్‌కు ఐటీడీఏ పీఓ రాహుల్ ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందజేశారు. కామేపల్లి మండలం గోపాలపురం తండాకు చెందిన సునీల్‌కుమార్ పదో తరగతిలో 10జీపీఏ సాధించి గురుకులంలో ఇంటర్ చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఐఐటీ భోపాల్‌లో సీటు సాధించారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ చదువుతున్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఏకాగ్రతతో అనుకున్నది సాధించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. సునీల్ తల్లి లలితకు ల్యాప్‌టాప్ అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఆర్థిక సాయం అందించేందుకూ కృషి చేస్తానని పీఓ పేర్కొన్నారు. ఏపీఓ డేవిడ్ రాజ్, పరిపాలన అధికారి రాంబాబు పాల్గొన్నారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నా..

- లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకుని..
- కదిరిలో యువకుడి బలవన్మరణం



ఉదయ్‌కుమార్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులతోపాటు ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని శుక్రవారం చనిపోయాడు. గతంలో కదిరిలో సీఐగా పనిచేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్ వేధింపులతోనే చనిపోతున్నట్లు లేఖలో పేర్కొన్నాడు. ఉదయ్‌కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. మూడేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించాడు. కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదుతో అతడిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితో పాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టారని తల్లిదండ్రులు ఆరోపించారు.

పోలీసులపై జిల్లా న్యాయస్థానంలో ఫిర్యాదు

ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధింపులకు గురిచేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. 'కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారు. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడు' అని చెప్పారు. బాలిక దూరమయ్యాక అతడు భద్రాచలానికి చెందిన ఓ యువతిని, తర్వాత హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన మరో యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారిద్దరూ దూరమయ్యారు. పోలీసులు, యువతుల కుటుంబ సభ్యులు బెదిరించడంతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు లేఖ రాసి ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

2న వైద్యాధికారి పోస్టుకు ముఖాముఖి

ఖమ్మం కమాన్‌బజార్: ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌లో వైద్యాధికారి పోస్టులకు అక్టోబరు 2న ఉదయం 10గంటలకు సర్వజనాసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ ద్వారా నియామకం చేపట్టనున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి.సుబ్బారావు తెలిపారు. ఎంబీబీఎస్ పూర్తిచేసి, తెలంగాణ మెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకున్న 44 ఏళ్లలోపు వయసున్న అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, అంగవైకల్యం కలిగిన వారికి పదేళ్ల వయసు మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఔట్ సోర్సింగ్ విధానంలో ఎంపికైన వైద్యాధికారికి నెలకు రూ.58,500 పారితోషికం చెల్లించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

మద్యం సీసాలతో పొడిచి దివ్యాంగుడి హత్య



ఆలోత్ భావ్‌సింగ్

కామేపల్లి, న్యూస్‌టుడే: దివ్యాంగ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన కామేపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గోవింద్రాల గ్రామానికి చెందిన ఆలోత్ భావ్‌సింగ్ (32)కు తల్లిదండ్రులు లేరు. చిన్నపాటి పనులు చేస్తూ అదే గ్రామంలోని సోదరి ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి మద్యం తాగేందుకని కొందరు యువకులు భావ్‌సింగ్‌ను సమీప పంటచేల వద్దకు తీసుకెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున పంట చేలకు వెళ్లే రైతులు అతడి మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు, డాగ్ స్క్వాడ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించాయి. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి శవాగారానికి తరలించి పోస్టుమార్టం చేయించారు. మృతుడి అక్క అజ్మీరా మాంగు ఫిర్యాదుతో ఎస్సై సాయికుమార్ కేసు నమోదు చేశారు. హత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్న గ్రామ యువకులను పట్టుకొనేందుకు గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. హత్యకు కారణాలేమిటి? హంతకులు ఎవరు? అనేది దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామన్నారు. ఖాళీ మద్యం సీసాలను పగులగొట్టి.. వాటితో తల, శరీరంపై దాడిచేసి భావ్‌సింగ్‌ను హతమార్చినట్లు గాయాలను చూస్తే తెలుస్తోంది.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు



పెనుబల్లి, న్యూస్‌టుడే: ఆగి ఉన్న ఉల్లిపాయల లోడు లారీని ఓ ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి ఏపీలోని ఏలూరుకు 13మంది ప్రయాణికులతో ప్రైవేటు బస్సు బయల్దేరింది. నిద్రమత్తులో ఉన్న బస్ డ్రైవర్ ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం సీతారాంపురం వద్ద ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. బస్సులో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. 12 మందికి స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులు పెనుబల్లి వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ హైదరాబాద్‌కు చెందిన పూర్ణచందర్‌రావును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. మిగతా వారు ప్రాథమిక వైద్యం చేయించుకొని వెళ్లిపోయారు.

ముగ్గురు నకిలీ మావోయిస్టుల అరెస్టు



చర్ల, న్యూస్‌టుడే: మావోయిస్టులమని చెప్పి లొంగిపోవడానికి వచ్చిన ముగ్గురు నకిలీ మావోయిస్టులను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బలోద్ జిల్లాలో శుక్రవారం జరిగింది. వివరాలను పరిశీలిస్తే... లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసే మావోయిస్టులకు పునరావాసంతో పాటు నజరానాతో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో గత కొంత కాలంగా మావోయిస్టులు పెద్ద సంఖ్యలో లొంగిపోతున్నారు. డబ్బులు వస్తాయని ఆశ పడ్డారో ఏమో.. ఆ యువకులు మావోయిస్టులమని పోలీసులనే నమ్మించారు.

★ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన మధు మోధియా, మంకు భోగం, ఓం ప్రకాశ్ నేతం అనే యువకులు బలోద్ ఎస్పీ కార్యాలయానికి లొంగిపోతామంటూ వచ్చారు. వాస్తవంగా బలోధ్ జిల్లాలో రెండు దశాబ్దాలుగా నక్సల్స్‌కు సంబంధించి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఈ క్రమంలో లొంగిపోవడానికి వచ్చిన ముగ్గురు యువకులపై నజర్ పెట్టిన పోలీసులు విచారణ చేపట్టారు. మావోయిస్టు పార్టీ మొహల్లా-మన్పూర్ ఏరియా కమిటీలో క్రియాశీలక సభ్యులుగా పనిచేస్తున్నట్లు పోలీసులతో ఈ ముగ్గురు యువకులు నమ్మబలికారు. అనుమానం వచ్చిన పోలీసులు వీరి గురించి తమదైన శైలిలో ఆరా తీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ యువకులు నకిలీ మావోయిస్టులని, డబ్బుకోసం లొంగిపోయే పథకం రచించారని విచారణలో తేలింది. దీంతో వీరిపై పోలీసులు చర్యలు చేపట్టారు.

ఘనంగా రామయ్యకు స్వర్ణ కవచాల అలంకరణ



హీరో సుహాస్‌తో రామాలయ ఉద్యోగులు


భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవడంతో వీక్షించిన భక్తులు మురిసిపోయారు. ఈ రూపంలో ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేశారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక కొనసాగించారు. పుష్యమి సందర్భంగా సీతారామ పట్టాభిషేకం చేశారు. పుణ్య జలాలను భక్తులపై చిలకరించారు. దర్బారు సేవ, తన్మయత్వాన్ని నింపింది. శనివారం బంగారు తులసీ దళాల అర్చన ఉంటుందని వైదికపెద్దలు తెలపారు. ఇదే రోజున సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన ఉంటుంది.

రామయ్యను దర్శించుకున్న హీరో సుహాస్: కలర్ ఫోటో, ప్రసన్న వదనం, అంబాజీపేట మ్యారేజిబ్యాండ్, రైటర్ పద్మభూషణ్ వంటి చిత్రాలలో కథానాయకుడిగా నటించిన సుహాస్ కుటుంబ సమేతంగా వచ్చి భద్రాచలం రాములవారిని దర్శించుకున్నారు. సూపరింటెండెంట్లు సాయిబాబా, శ్రీనివాసరావు వారికి సాదరంగా స్వాగతం పలకగా వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు. ఆయనతో ఫొటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం కనబరిచారు.

ఆదాయం రాక.. ఆబ్కారీ అధికారుల హైరానా!

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

ఎంత కాదన్నా ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు మద్యం విక్రయాలే. ప్రభుత్వం ఏటా మద్యం విక్రయాలకు లక్ష్యం నిర్దేశిస్తోంది. ఈ ఏడాది ఆదాయాన్ని గత ఏడాదితో పోల్చి చూస్తున్నారు. నెలవారీగా లక్ష్యాన్ని చేరుకోకుంటే ఉన్నతాధికారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో జిల్లా ఆబ్కారీశాఖ ఉరుకులు పరుగులు పెడుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గత ఏడాది అక్టోబరులో మద్యం విక్రయాల ద్వారా రూ.117 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది 35 శాతం తగ్గడంతో శాఖ అధికారులు, సిబ్బంది హైరానా పడుతున్నారు. ఆబ్కారీశాఖ రాష్ట్ర సంయుక్త కమిషనర్ సురేష్ రాథోడ్ స్థానిక అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. ఆదాయం తగ్గడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల భారీ వర్షాలు, వరదలతో రాబడి తగ్గిందని ఇక్కడి అధికారులు చెప్పినట్లు తెలిసింది. వరద ప్రభావం కొన్ని ప్రాంతాల్లోనే ఉండగా.. ఉమ్మడి జిల్లాలో అన్ని స్టేషన్ హౌజ్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ)ల పరిధిలో లోటు ఎందుకొచ్చిందని ప్రశ్నించినట్లు



తెలుస్తోంది. దీనికి తోడు బార్ లైసెన్స్‌ల పునరుద్ధరణ కోసం చెల్లించాల్సిన మొత్తం సకాలంలో రావడం లేదు. తాము నష్టాల్లో ఉన్నామని, త్వరలో చెల్లిస్తామని బార్‌ల యజమానులు తెగేసి చెబుతుండటంతో ఆబ్కారీ అధికారులకు ఎటూ పాలుపోవడం లేదు. ఓ వైపు మద్యం విక్రయాల ఆదాయం తగ్గడం, మరోవైపు బార్ లైసెన్స్ ఫీజులు రాకపోవడంతో లక్ష్యం చేరుకుంటామా? లేదా అనే ఆందోళనలో ఉన్నట్లు తెలిసింది. ఖమ్మం జిల్లాలో ఏడు, భద్రాద్రి కొత్తగూడెంలో ఆరు ఎస్‌హెచ్‌ఓ స్టేషన్లు ఉన్నాయి. ఎలాగైనా లక్ష్యం చేరుకోవాలనే ఆదేశాలు రావడంతో తనిఖీలు పక్కన పెట్టి ఆదాయం పెంచే పనిలో నిమగ్నమయ్యారు. బార్లు, మద్యం దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు ఒక అడుగు ముందుకేసి జామీనుపై డిపో నుంచి దుకాణాల ద్వారా సరకు ఎత్తిస్తున్నారు. వాళ్లు కట్టలేకపోతే జామీను ఉన్న మా పరిస్థితి ఏమిటనే భయం కూడా అధికారుల్లో ఉంది. శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు రంగంలోకి దిగడాన్ని బట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆబ్కారీశాఖలోని పరిస్థితిని అంచనా వేయవచ్చు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	4,500	7,011	6,700
పాతపత్తి	4,500	7,500	7,400
పెసలు	4,000	7,220	6,460
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	12,000	20,000	17,000
ఎండుమిరప	11,200	18,200	15,000
ఏసీ తాలుమిరప	9,000	9,800	8,200

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

సమస్యలు పరిష్కరించాలని వినతి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలంటూ అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఖమ్మంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. డీఐఈఓ రవిబాబుకూ వినతి పత్రం అందించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు, వంకాయలపాటి రాజు, మల్లూరు సత్య పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థులు

'సామాజిక దృక్పథం ఉండాలి'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక దృక్పథాన్ని కలిగి ఉండాలని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.గోపీ అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఎస్ఎస్ఎస్ విభాగం యూనిట్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రిన్సిపల్, యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.మాధవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: వైరా క్రాస్‌రోడ్డు ఎన్ఎస్‌పీ క్వార్టర్స్ సమీపంలో డ్రైనేజీ శుభ్రం చేయక దుర్వాసన వస్తోంది. పందుల సమస్య ఉంది? - **శ్రీను**

సమాధానం: డ్రైనేజీలో పూడికతీసి శుభ్రం చేస్తాం. పందుల సమస్యను పరిష్కరిస్తాం. **చింతా వేణు, కమిషనర్** – వైరా, న్యూస్‌టుడే

కారేపల్లి ఇల్లెందు రైల్వేగేటు సమీపంలో రైతుల చేలకు సరఫరా అయ్యే విద్యుత్తు తీగలతో ఇబ్బందులు పడుతున్నాం. సంస్థ అధికారుల పట్టింపు కరవైంది.
- **స్థానిక రైతులు**

✔ తక్షణమే సమస్యను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **విజయ్‌కుమార్, ఏఈ** – కారేపల్లి, న్యూస్‌టుడే

శ్రీరంగం శ్రీనివాసాచార్యులు, వీఎం బంజర్: హనుమాన్ వీధిలో వర్షపు నీరు నిలిచి నడవడం ఇబ్బందిగా మారింది. దోమలు వ్యాపిస్తున్నాయి.

✔ **ఎం.రవిప్రసాద్, కార్యదర్శి:** ఆ వీధిలో నీటిని తొలగించే పనులు వెంటనే చేపడతాం.
– పెనుబల్లి, న్యూస్‌టుడే

చిరుపొట్ట దశలో నీరు తప్పనిసరి

కల్లూరు, న్యూస్‌టుడే: బత్తులపల్లి ఎత్తిపోతల ఆయకట్టులో ఉన్న వరిపొలాలను ఏడీఏ శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఎండిపోయే దశలో ఉన్న వరి రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు చిగురిస్తుందన్నారు. ఆయకట్టుకు ఏ నీటివనరు నుంచైనా తప్పనిసరిగా నీరందించాలని సూచించారు. ఏవో రూప, ఏఈవో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం కల్తీ చేసిన వారిని శిక్షించాలి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: తిరుమలలో లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని శిక్షించాలని శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు డిమాండ్ చేశారు. కాకర్లపల్లి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి రింగ్ సెంటర్ వరకు శుక్రవారం సత్తుపల్లిలోని అన్ని దేవాలయ పాలక మండలి సభ్యులు, అన్ని ఆధ్యాత్మిక సంస్థల సభ్యులు, వేంకటేశ్వరస్వామి భక్తులు నిరసన ప్రదర్శన చేశారు. తహసీల్దార్ యోగీశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కూసంపూడి శ్రీనివాసరావు, మట్టా అజయ్‌కుమార్, చలసాని సాంబశివరావు, కృష్ణారావు, విష్ణురెడ్డి, అప్పారావు, మల్లూరు అంకంరాజు, మాధురి, మధు పాల్గొన్నారు.


సత్తుపల్లిలో ప్రదర్శన నిర్వహిస్తున్న వేంకటేశ్వరస్వామి భక్తులు

ప్రజారోగ్యంతో చెలగాటం..

◆ రోడ్డు పక్కనే వ్యర్థాలను పోస్తున్న పుర యంత్రాంగం

మధిర, న్యూస్‌టుడే

'శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డ' చందంగా ఉంది మధిర పురపాలకం పరిస్థితి.. మెరుగైన పారిశుద్ధ్య సమాజం కోసం శ్రమించాల్సిన మున్సిపాలిటీ అధికారులే అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. చెత్త నిర్వహణలో ఏళ్లుగా తమ పేరిట ఉన్న 'చెత్త' రికార్డును చెరిపే ప్రయత్నమే చేయటం లేదు. ఇంకోపక్క తమ నిర్లక్ష్యంతో పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ప్రజారోగ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నారు. 'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి.. వ్యాధులకు దూరంగా ఉండండి' అంటూ పురవాసులకు హితబోధ చేస్తూ తాము మాత్రం డంపింగ్ యార్డు నిర్వహణను గాలికొదిలేశారు.


రాయపట్నం బ్రిడ్జి వద్ద రహదారి పక్కన వేసిన చెత్తాచెదారం నుంచి వెలువడుతున్న పొగ

ఇదీ విషయం...

మధిర పురపాలకం 2013లో ఏర్పాటైంది. డంపింగ్ యార్డు లేకపోవటంతో పట్టణంలో సేకరించిన చెత్తను, ఇతర వ్యర్థాలను రాయపట్నం బ్రిడ్జి పక్కన, బైపాస్ రహదారి వెంట వేసేవారు. ప్రజా విజ్ఞప్తులు, నాయకుల ప్రయత్నాలు వెరసి మడుపల్లిలో మూడేళ్ల క్రితం డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించారు. రూ.లక్షల వ్యయంతో అక్కడ తడి, పొడిచెత్త ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. యార్డు సమీపం వరకూ రహదారి కూడా నిర్మించారు. ఇంత చేసినా పురపాలక చెత్త ఆటోలు, ట్రాక్టర్లు అక్కడకు వెళ్లటం లేదు. పాత స్థలంలోనే రోడ్డు వెంట పారబోస్తున్నారు. అనధికార డంప్ యార్డును కొనసాగిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే 'కొత్త చోటుకు వెళ్లే రహదారి పూర్తి స్థాయిలో అభివృద్ధి కాలేద'ని సమాధానమిస్తున్నారు. వర్షాకాలంలో సమస్య ఉందనుకున్నా మిగిలిన రోజుల్లో అయినా వెళ్తున్నారా? అంటే ఆ ప్రయత్నమే చేయటం లేదు. అధికారిక డంపింగ్ యార్డు ఉందన్న విషయాన్ని విస్మరించి రోడ్ల పక్కనే చెత్తను గుమ్మరిస్తూ, దహనం చేస్తూ 'మీ తిప్పలు మీరు పడండి' అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు.

ఇబ్బందేంటి?

☛ మధిర - నందిగామ రహదారిలో వైరానదిపై నిర్మించిన రాయపట్నం బ్రిడ్జి వద్ద రోడ్డుపక్కన చెత్త పేరుకపోతోంది. ఎప్పటికప్పుడు నిప్పు పెడుతుండటంతో విష వాయువులు, పొగ వ్యాపిస్తూ ఆ మార్గంలో ప్రయాణించే వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

☛ తెలుగు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఈ రహదారిలో 30 గ్రామాల ప్రజల నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సరిహద్దులో ఉన్న ఏపీ పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్తుంటారు. ఇక్కడికి రాగానే ముక్కుపుటాలదిరే దుర్వాసన వస్తోంది.

☛ చెత్తను కాల్చొద్దన్న నిబంధన యంత్రాంగమే ఉల్లంఘిస్తున్నారు.

☛ సమీప 4, 13 వార్డుల్లో నివాసాలను పొగ చుట్టుముడుతుండటంతో స్థానికులు అనారోగ్యం బారినపడుతున్నారు.

☛ పరిస్థితి ఇలానే ఉంటే రెండు వార్డుల్లో ఊపిరితిత్తుల వ్యాధులు విజృంభిస్తాయన్న ఆందోళన వ్యక్తం అవుతోంది.

జనాభా - 40 వేలు
వార్డులు - 22
ప్రతి రోజు సేకరించే తడి, పొడి చెత్త - 30 మెట్రిక్ టన్నులు
చెత్త సేకరణకు ఉపయోగించే వాహనాల సంఖ్య - 17 (12 ఆటోలు, ఐదు ట్రాక్టర్లు)
సఫాయి కార్మికుల సంఖ్య - 75



'చెత్తను తగులబెడుతుండటంతో పొగ రోడ్డుపైకి వస్తోంది. ముందున్న వాహనాలు కనిపించటం లేదు. ఓ వైపు వ్యర్థాల దుర్వాసన, మరో వైపు దట్టమైన విషవాయువులు అనారోగ్యాన్ని తెచ్చిపెడుతున్నాయి. అధికారులు వెంటనే డంపింగ్ యార్డును వినియోగంలోకి తేవాలి'.
- చెరుకూరి వెంకట్రావు, మధిర

'చెత్త రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం. మడుపల్లి సమీపంలో డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని కేటాయించారు. అందులోకి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. మూడు నెలల్లో రాయపట్నం బ్రిడ్జి వద్ద నుంచి మడుపల్లి తరలించి సమస్యకు పరిష్కారం చూపిస్తాం.'
- రేవతి, పురపాలక హెల్త్ అసిస్టెంట్

స్వచ్ఛంద సేవకుడు చంద్రమౌళికి నివాళి



సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లికి చెందిన స్వచ్ఛంద సేవకుడు, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి(80) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కోపరేటివ్ బ్యాంక్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఆర్టీసీ బస్టాండ్ ఎంక్వైరీలో స్వచ్ఛందంగా పనిచేశారు. ఎమ్మెల్యే రాగమయి, ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

కొండచిలువ పట్టివేత

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని అర్బన్ పార్కు ఎదురుగా ఆరు అడుగుల కొండచిలువను స్థానికులు గుర్తించారు. విషయాన్ని అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విశ్రాంత ఎఫ్‌బీవో మొహమ్మద్ కొండచిలువను పట్టుకుని కిష్టారం అటవీ ప్రాంతంలో వదిలేశారు.

యువతిపై దాడి

వేంసూరు, న్యూస్‌టుడే: వేంసూరు గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన కవులూరి కిశోర్ తరచూ ఫోన్ చేసి వేధిస్తుండేవాడు. సదరు యువతి అతణ్ని నిలదీసేందుకు వెళ్లింది. కుటుంబ సభ్యులతో కలిసి కిశోర్ దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హుండీలోని నగదు చోరీ

తల్లాడ: రామచంద్రాపురం ఆంజనేయస్వామి దేవాలయంలోని హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రూ.1500 తీసుకొని మామిడితోట సమీపంలో పడేశారు. ఎస్సై బి.కొండలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలింత మృతి: ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి చెందిందంటూ ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి సత్తుపల్లి పట్టణంలోని ఓ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం నాచారం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి శ్రావణి(21)కి ఏపీలోని చింతలపూడికి చెందిన వివేక్ వర్ధన్‌తో వివాహమైంది. నెలలు నిండిన శ్రావణిని గురువారం సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకొచ్చారు. సిజేరియన్ చేయగా ఆడబిడ్డ జన్మించింది. శస్త్రచికిత్స అనంతరం శ్రావణికి తీవ్ర రక్తస్రావం కావటంతో అదే రోజు అర్ధరాత్రి ఖమ్మం తీసుకెళ్లాలని వైద్య సిబ్బంది సూచించారు. ఖమ్మంలో ఓ ప్రైవేటు వైద్యులు పరీక్షలు నిర్వహించి పరిస్థితి ఇబ్బందికరంగా ఉందని, హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. శుక్రవారం బాలింతను తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందింది. శస్త్రచికిత్స చేసిన ఆసుపత్రి వైద్యుల కారణంగానే శ్రావణి మృతి చెందిందంటూ కుటుంబ సభ్యులు సతుపల్లిలో ఆమె మృతదేహంతో ఆందోళన చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడుతున్నారు.

ఆలోచన బాగుంది.. వాలీబాల్ నిండింది

సాధారణంగా వాలీబాల్లో గాలి తగ్గిపోతే సైకిల్ దుకాణం వద్దకు వెళ్లి పంపుతో నింపుతుంటా. సత్తుపల్లిలోని జేవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం విద్యార్థులు వాలీబాల్ ఆడుతున్న క్రమంలో బంతిలో గాలి తగ్గిపోయింది. ఈ క్రమంలో విద్యార్థులు సమయస్ఫూర్తితో ఆలోచించారు. అక్కడున్న ద్విచక్ర వాహనం సైలెన్సర్ వెనక భాగంలో బంతిని వాల్ సాయంతో ఉంచి ఎక్స్‌లేటర్ ఇస్తూ గాలినింపారు.
– సత్తుపల్లి, న్యూస్‌టుడే



ఆసుపత్రిలోనే వైద్య పరీక్షలు నిర్వహించాలి: అదనపు కలెక్టర్

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి ఏరియా వైద్యశాల, లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ శుక్రవారం తనిఖీ చేశారు. ఏరియా వైద్యశాలలో రక్త పరీక్షల కోసం రోగులను బయటకు పంపుతుండటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. పేదలే ప్రభుత్వ వైద్యశాలకు వస్తారని అన్ని పరీక్షలు వైద్యశాలలో జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి వైద్యులు, సిబ్బంది పని తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు కిరణ్‌కుమార్‌ని, సిబ్బందిని అభినందించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల నిరసన

వైరా, న్యూస్‌టుడే: అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని సురవరం ప్రతాపరెడ్డి పేరుతో మార్చడాన్ని నిరసిస్తూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైరాలో నిరసన వ్యక్తం చేశారు. పాతబస్టాండ్‌లో శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపి అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. వర్తక సంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు, మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, కె.వి.సుబ్బారావు, మిట్టపల్లి సత్యంబాబు పాల్గొన్నారు.


విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్యవైశ్యులు

ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేక సర్వే పరిశీలన

బోనకల్లు, న్యూస్‌టుడే: ఎఫ్ఎల్ఎన్ ప్రత్యేక సర్వే తీరును బోనకల్లులో జిల్లా బృందం శుక్రవారం పరిశీలించింది. సీఎస్ఎఫ్, సీఆర్ఐఎస్‌పీ సంస్థలు మూడో తరగతి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్నారు. ఆళ్లపాడు, చిరునోముల ప్రాథమిక పాఠశాలల్లో డైట్ ప్రిన్సిపల్ సామినేని సత్యనారాయణ, అధ్యాపకులు సత్యనారాయణరాజు, ఎంఈవో పుల్లయ్య పరిశీలించారు.

'రెగ్యులర్ పోస్ట్‌లో నియమించాలి'

ఏన్కూరు, న్యూస్‌టుడే: 2008 డీఎస్సీ ఎంపిక అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా రెగ్యులర్ పోస్ట్‌లో నియమించాలని డీఎస్సీ 2008మెరిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రేగళ్ల శేషు విజ్ఞప్తి చేశాడు. శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 1,200 మంది సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత ముఖ్యమంత్రి, సమస్యల పరిష్కారం దిశగా వెళ్లడం చాలా సంతోషకరమన్నారు.

5న మాదిగల ఆత్మగౌరవ సభ

తల్లాడ: తల్లాడలో అక్టోబరు 5న నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు ఏపూరి వెంకటేశ్వరరావుమాదిగ కోరారు. తల్లాడలోని అంబేడ్కర్ భవనంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో మాటడారు.

బాలాలయానికి భూమిపూజ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: హనుమాన్‌నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణం నేపథ్యంలో బాలాలయానికి శుక్రవారం భూమిపూజ చేశారు. సత్యనారాయణ, శ్రీనివాసరావు, టెక్కెమ్మరెడ్డి పాల్గొన్నారు.

సత్యశోధన్ సమాజ్ వార్షికోత్సవం

కారేపల్లి, న్యూస్‌టుడే: జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధన్ సమాజ్ 151వ వార్షికోత్సవం కారేపల్లిలో సీపీఐ మాస్‌లైన్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు గుగులోత్ తేజ్యానాయక్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్వీ రాకేష్‌లు పులే దంపతుల చిత్రపటాలపై పూలమాలలు ఉంచారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సక్రునాయక్, రమేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశం

కారేపల్లి, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ మండల సర్వసభ్య సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు అధ్యక్షతన కారేపల్లిలో శుక్రవారం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాలిక వెంకట్‌రెడ్డి, వాంకుడోతు మంగీలాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తల్లాడ, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా మల్సూర్‌తండా, రంగంబంజర గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్‌కుమార్ తెలిపారు.

పైప్‌లైన్ మరమ్మతులకు నిధులు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఈ నెల 1న కురిసిన భారీ వర్షాలకు కట్లేరుకు వరద పోటెత్తి మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. సమస్యపై స్థానిక నాయకులు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులకు రూ.30 లక్షలు మంజూరు చేయించారు.

'ఉరితాడును ముద్దాడిన భగత్ సింగ్'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్వాతంత్ర్యం కోసం ఉరితాడును ముద్దాడిన పోరాట యోధుడు భగత్‌సింగ్ అని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లిలో శుక్రవారం భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. సొసైటీ ఉపాధ్యక్షుడు గాదె చెన్నారావు, దండు ఆదినారాయణ, శ్రీనివాసరావు, రాంబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

✦ పెనుబల్లి మండలం కుప్పెనకుంటకు చెందిన కాంగ్రెస్ నాయకులు వరద బాధితుల సహాయార్థం రూ.19,100, బయ్యన్నగూడెం నాయకులు ఆరు క్వింటాళ్ల బియ్యం ఎమ్మెల్యేకు అందజేశారు.

శిశు మరణాల రేటును తగ్గించాలి: ఎమ్మెల్యే: కల్లూరు, న్యూస్‌టుడే: గర్భిణులకు మార్గనిర్దేశం చేస్తూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు శిశుమరణాల రేటును తగ్గించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. కల్లూరు ఏఎంసీ భవనం ఆవరణలో శుక్రవారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాశనలు నిర్వహించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ భాగం నీరజాదేవి, సీడీపీవో నిర్మలాజ్యోతి, తహసీల్దారు సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాలశీతల కేంద్రం ఏర్పాటుకు స్థలం పరిశీలన

చింతకాని, న్యూస్‌టుడే: జగన్నాథపురంలో ఇందిరా డెయిరీ ప్రాజెక్టుకు సంబంధించి పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు స్థలాన్ని డీఆర్డీఓ సన్యాసయ్య శుక్రవారం పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు అనుకూలంగా స్థలం ఉందని పేర్కొన్నారు. డీపీఎం రేవతి, ఏపీఎం (డెయిరీ) లక్ష్మణరావు, ఏపీఎం తిరుమలరావు పాల్గొన్నారు.

బోనకల్లు, న్యూస్‌టుడే: ఇందిరా డెయిరీ పాల శీతలీకరణ యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని డీఆర్‌డీవో సన్యాసయ్య శుక్రవారం సరిశీలించారు. బోనకల్లులో ఐకేపీ మహిళల భాగస్వామ్యంతో రూ.వంద కోట్లతో ఇందిరా డెయిరీ నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసిందే. ఐకేపీ భవనం పక్కనున్న స్థలాన్ని పరిశీలించి ఎంపిక చేశారు. తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశాస్త్రి, ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.


జగన్నాథపురంలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ

కళాశాల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు కళాశాల ప్రిన్సిపల్ సింహాచలం శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. కళాశాలకు సీసీరోడ్డు, మరుగుదొడ్లు మంజూరు చేయాలని, తరగతి గదుల ఫ్లోరింగ్ దెబ్బతిందని, కళాశాలకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గూడపాటి కృష్ణప్రసాద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ సింహాచలం

వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటన

మధిర, న్యూస్‌టుడే: ఇల్లెందులపాడు గ్రామంలో పత్తి, వరి పంటలను మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయ్‌చంద్ర, పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రుక్మిణీదేవి, నాగస్వాతి, వ్యవసాయ అధికారి డీఎంకే శ్రీనివాసరావు బృందం శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పత్తిలో రసం పీల్చే, గులాబీ రంగు పురుగు ఆశించినట్లు గుర్తించారు. సస్య రక్షణ చర్యలు సూచించారు.


ఇల్లెందులపాడులో వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చింతకాని, న్యూస్‌టుడే: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య పేర్కొన్నారు. జగన్నాథపురం, తిమ్మినేనిపాలెం, తిరుమలాపురం గ్రామాల్లోని మిరప, వరి, పత్తి పైర్లను పరిశీలించారు. ఏఓ నాగయ్య పాల్గొన్నారు.

వేంసూరు, న్యూస్‌టుడే: రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సొసైటీలు, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాలను ఏడీఏ శ్రీనివాసరెడ్డి కోరారు. కరివెద పద్ధతిలో సాగు చేస్తున్న వరిపంటను శుక్రవారం పరిశీలించారు. ఏఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత

వైరా, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు ప్రవాసీయులు చేయూత అందించారు. అమెరికాలో ఉంటున్న వేమూరి సుధీర్, అజయ్ సౌజన్యంతో తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు వేమూరి సత్యనారాయణ సిరిపురంలో విద్యార్థులకు శుక్రవారం నగదు అందించారు. ఇంజినీరింగ్ చదువుతున్న రౌతు సురేశ్‌కు ల్యాప్‌టాప్ నిమిత్తం రూ.60 వేలు, మరో విద్యార్థి కొత్తపల్లి ధనుష్, శ్రావణ్‌కు రూ.10 వేల చొప్పున అందించారు. కొమ్మూరి లయకు రూ.20 వేలు, మన్నె ఆశ్రిత్‌కు రూ.5 వేలందించారు. హెచ్ఎం సూర్యకుమారి, ఏపీసీ ఛైర్మన్ కృష్ణకుమారి, ఎస్ఎంసీ ఛైర్మన్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తానా ఫౌండేషన్ చేయూత: ఏన్కూరు, న్యూస్‌టుడే: ఖమ్మంలోని శాంతినగర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన తానా ఫౌండేషన్ ఆదరణ కార్యక్రమంలో భాగంగా ఏన్కూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాట్రగడ్డ సునీత జ్ఞాపకార్థం 15 సైకిళ్లను పంపిణీ చేశారు.

ఏన్కూరు, న్యూస్‌టుడే: ఏన్కూరు రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న పెనుగొండ రాకేశ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 1992 బ్యాచ్ విద్యార్థులు నాగేశ్వరరావు, రవి, కిరణ్, నాగయ్య, కృష్ణ రూ.15 వేలు అందజేశారు.


వైరా: నగదు అందిస్తున్న వేమూరి సత్యనారాయణ

ముదిగొండ, న్యూస్‌టుడే: వనంవారికిష్టాపురానికి చెందిన నాగరాజు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స కోసం ముదిగొండ సొసైటీ ఛైర్మన్ యలగొండస్వామి శుక్రవారం రూ.10వేలు అందజేశారు.

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లిలో 15 కుటుంబాల్లోని దివ్యాంగులకు భారాస మైనార్టీ సెల్ నాయకుడు షేక్ గౌసుద్దీన్ శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

మధిర పట్టణం, న్యూస్‌టుడే: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం స్థానిక భారాస కార్యాలయంలో నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి లింగాల కమల్‌రాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మధిర: నివాళులర్పిస్తున్న కమల్‌రాజు తదితరులు

ముదిగొండ, న్యూస్‌టుడే: ముదిగొండ తహసీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, సిబ్బంది శుక్రవారం నివాళులర్పించారు.

వైరా, కారేపల్లి, న్యూస్‌టుడే: కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని కారేపల్లి, వైరా మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కమిషనర్ చింతా వేణు పాల్గొన్నారు.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శుక్రవారం కొండా లక్ష్మణ్ జయంతిని నిర్వహించారు. పీజేపీసీ ఛటర్జీ నివాళులర్పించారు.

పెనుబల్లి, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎంపీడీవో అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


సత్తుపల్లి: గంగారం బెటాలియన్‌లో కమాండెంట్ ఛటర్జీ, ఇతర అధికారులు


వైరాలో నివాళులర్పిస్తున్న ముళ్లపాటి, కమిషనర్ వేణు

బాలికలు.. ఖో-ఖోలో మెరికలు

మధిరగ్రామీణం, న్యూస్‌టుడే

ఏకంగా ఆ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ప్రాతినిధ్యం వహించారు. ప్రధానోపాధ్యాయుడే శిక్షకుని అవతారమెత్తి వెన్నుతట్టి ప్రోత్సహిస్తుండటంతో చిన్నారులు రాణిస్తున్నారు. మధిర మండలం మాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి చదువుతున్న బాలికలు ఖో-ఖో పోటీల్లో ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన దేవిశెట్టి సుమల్లిక, చిలువేరు జయశ్రీ, మేడిశెట్టి భవాని ఈ నెల 13, 14, 15న రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు. జట్టు అయిదో స్థానంలో నిలిచినా మెరుగైన ప్రదర్శన చూపారు. గతంలో పీడీగా పనిచేసిన చెరుకుపల్లి శ్రీహరి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు ప్రధానోపాధ్యాయునిగా వచ్చారు. విద్యార్థినులతో నిత్యం సాయంత్రం వేళలో సాధన చేయిస్తున్నారు.


రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థినులు దేవిశెట్టి సుమల్లిక, చిలువేరు జయశ్రీ, భవాని

'చిన్ననాటి నుంచి ఆటలంటే ఇష్టం. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నాం. ఖో-ఖో పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనటం ఆనందంగా ఉంది. మరింత సాధన చేసి ముందుకెళ్తాం.'
- విద్యార్థినులు.

'పాఠశాల విద్యార్థినులు ఖో--ఖోలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని రాణిస్తున్నారు. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నాం.' - చెరుకుపల్లి శ్రీహరి, హెచ్ఎం.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

ఎమ్మెల్సీ కోదండరాం సన్మాన సభను విజయవంతం చేయాలి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మంలో ఈనెల 29న ఎమ్మెల్సీ కోదండరాంతోపాటు అమీర్‌అలీఖాన్‌కు ప్రజాస్వామిక అల్పసంఖ్యాక ఫ్రంట్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్రంట్ నాయకులు మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నిర్వాహకులు సయ్యద్ అజీమ్, ఎస్.కె.ఖాజామియా, నసీర్ అహ్మద్, ఖాన్, ఉమర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ అజీమ్

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: డీఎస్‌ఆర్‌సీ కౌన్సెలర్ పోస్టు నియామకానికి అభ్యర్థుల నుంచి అక్టోబరు 5వ తేదీలోపు దరఖాస్తులు కోరుతున్నట్లు సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుగ్రాడ్యుయేట్, డిప్లొమా సైకాలజీ, సోషల్ వర్క్, సోషియాలజీ, ఆంథ్రోపాలజీ, హ్యూమన్ డవలప్‌మెంట్, నర్సింగ్ పీజీ డిగ్రీ, డిప్లొమా ఉన్న వారు అర్హులన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కామేపల్లి, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తితో వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బండిపాడులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కురసం ఎర్రయ్య(50) పదేళ్ల నుంచి భార్యతో దూరంగా ఉంటున్నాడు. జీవాల పెంపకం చేస్తూ బతుకు కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి పురుగుమందు తాగాడు. ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుని భార్య సీలమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: చెరువుమాదారం గ్రామానికి చెందిన గెల్లా అఖిల్, నేలకొండపల్లికి చెందిన మేకల శ్రీనుల వేర్వేరు ఘటనల్లో శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అఖిల్ వ్యక్తిగత కారణాలతో, శ్రీను కుటుంబ, ఆర్థిక సమస్యల నేపథ్యంలో బలవన్మరణానికి యత్నించారు. వీరిద్దరిని నేలకొండపల్లి సీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు



రెండో డివిజన్‌లో పర్యటిస్తున్న మేయర్ నీరజ, కమిషనర్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు ఉండి, వాటిని శుభ్రంగా ఉంచుకోని యజమానులందరికీ నోటీసులు జారీ చేయనున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. శుక్రవారం నగరంలోని ఒకటి, రెండో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల కారణంగా పడుతున్న ఇబ్బందులను స్థానికులు వారికి వివరించారు. కార్పొరేటర్లు తేజావత్‌హుస్సేన్, మలీదు వెంకటేశ్వర్లు, సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఏసీపీ వసుంధర, డీఈ ధరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

★ దానవాయిగూడెం డంపింగ్ యార్డు తరలించాలని స్థానికులు అందోళన చేసిన నేపథ్యంలో మూడు నెలల్లో సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యలు హామీ ఇచ్చారు.

ఏం ఎలా చేద్దాం?



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

మున్నేరు వరదల నుంచి ఖమ్మం ప్రజలను సురక్షితంగా కాపాడేందుకు నదికి రెండు వైపులా నిర్మాణం చేపట్టిన రక్షణ గోడల ఎత్తు పెంచటమా? నది వెడల్పు చేయటమా? అనే మీమాంసలో నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులున్నారు. 2023లో మున్నేరు నదికి 30 అడుగుల వరద రావటంతో రెండు వైపులా 33 అడుగుల ఎత్తులో రక్షణ గోడలు నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.590 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. 2024 సెప్టెంబర్‌లో 36 అడుగుల వరద రావటంతో రక్షణ గోడల నిర్మాణ పనులు రీడిజైన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా 40 అడుగుల ఎత్తులో రక్షణ గోడలు నిర్మించాలని పలువురు సూచిస్తున్నారు. దీనిపై నిపుణుల కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇస్తుందని, రీడిజైన్ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

★ రక్షణ గోడల ఎత్తు 40 అడుగులకు పెంచాలని, పునాదుల వద్ద (ఫుటింగ్స్) ప్రస్తుతం 20 అడుగుల వెడల్పుతో నిర్మిస్తుండగా 30 అడుగుల వెడల్పునకు పెంచాల్సి వస్తుందని ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. దీంతో నిర్మాణ వ్యయం మరో రూ.200 కోట్లు పెరిగే అవకాశం ఉందని ప్రాథమికంగా లెక్కలేస్తున్నారు. ఖమ్మంలోని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు రీడిజైన్ ప్రతిపాదనలు సీడీఓ(సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్)కు పంపనున్నారు. వరంగల్‌లోని ఎన్‌ఐటీ, సీడీఓ అధికారులు, విశ్రాంత ఇంజినీరింగ్ అధికారులతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత క్షేత్ర స్థాయిలో పరిశీలించే అవకాశం ఉందని తెలుస్తోంది.

★ ఖమ్మంలో మున్నేరు నదిపై ఎన్నెస్పీ అక్విడెక్ట్ నుంచి దిగువన ప్రకాశ్‌నగర్ వరకు నది బెడ్ వెడల్పు 230 మీటర్లుగా నిర్ణయించి గోడల నిర్మాణం చేపట్టారు. ఎగువన దానవాయిగూడెం వైపు 320 మీటర్లు వెడల్పుగా నిర్ణయించారు. అక్కడ ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున వెడల్పు పెంచారు. ఖమ్మం నగరం పరిధిలో మాత్రం ప్రభుత్వ భూమి అందుబాటులో లేదు. ఇప్పటికే రెండు వైపులా 180 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టారు. ఈ ప్రాంతంలోనూ రక్షణ గోడల మధ్య నది వెడల్పు కనీసం 250 మీటర్లకు పెంచితే గోడల ఎత్తు పెంచాల్సిన అవసరం రాదని, రోడ్డు వంతెనలకు ప్రమాదం ముప్పు తప్పుతుందని అంచనా వేస్తున్నారు. ఇందుకు నది ఒడ్డున కొన్ని ఇళ్లు కోల్పోయే వారికి పోలేపల్లి, దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఎన్నెస్పీ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించటం ద్వారా కొంత వరకు సమస్య పరిష్కరించవచ్చని భావిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే వందేళ్లలో ఖమ్మం నగరానికి వరద ముప్పు లేకుండా తీర్చిదిద్దవచ్చని ఇంజినీరింగ్ నిపుణులు వివరిస్తున్నారు.

మున్నేరు గోడల ఎత్తు పెంచితే...

మున్నేరు నదిలో ఖమ్మం నగరంలో 230 అడుగుల వెడల్పుతో రెండు వైపులా నది ఒడ్డున 33 అడుగుల ఎత్తులో రక్షణ గోడ నిర్మిస్తున్నారు. ఈ గోడలు 40 అడుగులకు పెంచటం వల్ల నీటి ప్రవాహ వేగం, ఒత్తిడి, ఎత్తు మరింత పెరుగుతుందని కొందరు ఇంజినీర్లు భావిస్తున్నారు. బైపాస్ రోడ్‌లో, ప్రకాశ్‌నగర్, కాల్వొడ్డులోని వంతెనలు, నిర్మాణంలో ఉన్న తీగల వంతెనలకు ప్రమాదం ఏర్పడుతుందని, గోడల నిర్మాణం తర్వాత వంతెనల పైనుంచి నీరు ప్రవహించే ప్రమాదం ఉందని పలువురు నిపుణులు వివరిస్తున్నారు. మున్నేరు నదికి రెండు వైపులా ఒడ్డు పక్కన 'రాక్ అవుట్ క్రాప్' (ఎగుడు దిగుడు రాతి బండలు) తొలగించటం ద్వారా 2 నుంచి 3 అడుగుల వరకు నది లోతు పెరుగుతుందని, ఆ రాళ్లు గోడల నిర్మాణంలో ఉపయోగించవచ్చని సూచిస్తున్నారు.

శ్రీరాంహిల్స్‌లో చోరీ

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం శ్రీరాంహిల్స్‌లో గురువారం అర్ధరాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. అర్బన్ పోలీసుల వివరాల ప్రకారం.. కాలనీకి చుట్టూ రక్షణగా ఉన్న సోలార్ ఫెన్సింగ్ కత్తిరించి దొంగలు లోపలికి ప్రవేశించారు. కేవీఆర్ రాజకుమార్, గాదె రాము అనేవారి ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. రాజ్‌కుమార్ నివాసంలో 8తులాల బంగారం, రూ.15 వేల నగదు, గాదె రాము నివాసంలో 2తులాల బంగారం అపహరించారు. నగర ఏసీపీ రమణమూర్తి, ఖానాపురం హవేలి ఇన్‌స్పెక్టర్ భాను ప్రకాశ్, పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో సినిమాలు..	
శ్రీనివాస:	సత్యం సుందరం
కెపిఎస్:	మత్తు వదలరా-2
శ్రీసాయిరాం, వినోద, శ్రీ తిరుమల:	దేవర పార్ట్-1

సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: నగర సమగ్రాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. ఖమ్మం కార్పొరేషన్ 31, 33, 34, 35, 46, 48 డివిజన్లలో శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. నాయకులు తుమ్మల యుగంధర్, యర్రం బాలగంగాధర్ తిలక్, బాణాల లక్ష్మణ్, ఆశ్రిఫ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాతానిగూడెంలో వైద్య శిబిరం

కామేపల్లి, న్యూస్‌టుడే: ఇమ్మాన్యుయేలు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సాతానిగూడెంలో శుక్రవారం నిర్వహించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్యులు భారత్, లతీఫ్, వాసవి, సంపత్ పాల్గొన్నారు.

బావోజితండా వాసికి డాక్టరేట్



ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: రఘునాథపాలెం మండలం బావోజితండాకు చెందిన **అంగోత్ లక్ష్మణ్** డాక్టరేట్ అందుకున్నారు. ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. వీఎల్ఎస్ఐలో పరిశోధన పత్రాన్ని సమర్పించి డాక్టరేట్ పొందారు.

29న ప్రమాణ స్వీకారం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 29న మద్దులపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఉంటుందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ బైరు హరినాథబాబు అన్నారు. మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ ప్రాంతంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ మంత్రులు పొంగులేటి, తుమ్మల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నట్లు వివరించారు. కాంగ్రెస్ నాయకులు భూక్య సురేశ్, వెంకటనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ అర్బన్ మండల అధ్యక్షుడిగా గుడిపూడి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ) ఖమ్మం అర్బన్ మండల అధ్యక్షుడిగా గుడిపూడి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రవికిరణ్, గౌరవ అధ్యక్షుడిగా ఎం.రాములు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ.దర్గయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా సునీత ఎన్నికయ్యారు.

టీటీజీడీఏ కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఖమ్మం యూనిట్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా కె.అశోక్‌కుమార్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచిలో శుక్రవారం టీపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా వి.యాకయ్య, ప్రధాన కార్యదర్శిగా జె.భద్రు ఎన్నికయ్యారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

కూసుమంచి, న్యూస్‌టుడే: మండలంలో 2023-24లో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రక్రియపై శుక్రవారం ప్రజావేదిక మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో రూ.5.92 కోట్ల విలువైన పనులు జరగ్గా, గత నెల 27నుంచి ఈనెల 5వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ప్రజా వేదికలో అదనపు డీఆర్‌డీవో శిరీష, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి డి.వీరయ్య, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచిలో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం వాటిల్లుతుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టౌన్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నారు.

ఏదులాపురం పురపాలికగా మార్పు..!

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే



ఖమ్మం గ్రామీణ మండలంలోని 12 గ్రామ పంచాయతీల (పది గ్రామ పంచాయతీలు పూర్తిగా, మరో రెండు పంచాయతీలు పాక్షికంగా)తో ఏదులాపురం పురపాలిక ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపించారు. మండలంలోని పది గ్రామ పంచాయతీలతో పెద్దతండా పురపాలిక ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను పంపించాలని ఆగస్టు 23న మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ గౌతమ్ జిల్లా అధికారులకు లేఖ రాశారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మండలాధికారులు మున్సిపాలిటీ ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణను ఇప్పటికే రూపొందించారు.

ప్రతిపాదిత గ్రామాలివే..

పురపాలిక అంటే పట్టణ ప్రాంతం కిందికి వస్తుంది. పేరులో తండా ఉంటే బాగోలేదని మున్సిపాలిటీకి పెద్దతండా పేరును మార్చి ఏదులాపురం అని నామకరణం చేశారు. 12 గ్రామ పంచాయతీలతో ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటు కానుంది. బారుగూడెం, చిన్నవెంకటగిరి, ఏదులాపురం, గొల్లగూడెం, గుదిమళ్ల, గుర్రాలపాడు, మద్దులపల్లి, ముత్తగూడెం, పెద్దతండా, తెల్దారుపల్లి, పల్లెగూడెం పంచాయతీ పరిధిలోని రెడ్డిపల్లి గ్రామం, పోలేపల్లి పంచాయతీలోని భద్రాదినగర్‌కాలనీ, సాయినగర్‌కాలనీ, నాలుగోతరగతి ఉద్యోగుల కాలనీ, వికలాంగుల కాలనీ, రాజీవ్ గృహకల్ప, రెండు పడక గదుల ఇళ్ల ప్రాంతాన్ని కలిపి ఏదులాపురం పురపాలికగా మార్చనున్నట్లు సమాచారం. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతిపాదిత పురపాలిక పరిధిలో 38,210 మంది జనాభా ఉంటే ప్రస్తుతం 58,647 మంది నివసిస్తున్నారు. ఓటర్లు 43,874 మంది ఉన్నారు.

మిత్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ వితరణ



వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న తుమ్మల యుగంధర్, మిత్రా ఫౌండేషన్ ఛైర్మన్ కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ తదితరులు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: మున్నేరు వరద బాధితులను ఆదుకునేందుకు ఖమ్మంకు చెందిన మిత్రా ఫౌండేషన్ సంస్థ ముందుకు వచ్చింది. శుక్రవారం ఖమ్మం వాసవీ గార్డెన్‌లో నిర్వహించిన వితరణ కార్యక్రమంలో రూ. 10లక్షల విలువైన నిత్యావసరాలను బాధితులకు అందజేశారు. కార్యక్రమాన్ని తుమ్మల యుగంధర్ ప్రారంభించారు. గ్యాస్ పొయ్యి, కుక్కర్, బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. మిత్రా ఫౌండేషన్ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో తమ సంస్థ ఆధ్వర్యంలో భద్రాచలం వద్ద గోదావరి వరద బాధితులకు రూ.11లక్షల విలువైన నిత్యావసరాలు అందించామని, కొవిడ్ సమయంలోనూ సేవలు అందించినట్లు తెలిపారు. సభ్యులు చారుగుండ్ల రవికుమార్, పాలవరపు శ్రీనివాస్, చెరుకూరి యుగంధర్, మహంకాళి నగేశ్, రంగా శ్రీనివాసరావు, ఆత్మకూరి రామారావు, గోళ్ల అవినాశ్, మాటేటి నాగేశ్వరరావు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ

కూసుమంచి, న్యూస్‌టుడే: సిరిసిల్ల జిల్లా నుంచి వచ్చిన 20మంది మత్స్య సహకార సంఘాల సభ్యులకు పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో మూడు రోజులపాటు ఇచ్చిన శిక్షణ శుక్రవారం ముగిసింది. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జి.లవకుమార్ మాట్లాడుతూ మత్స్యకారులు చేప మాసంతో తయారయ్యే ఉత్పత్తుల విక్రయాల ద్వారా మరిన్ని లాభాలు అర్జించే అవకాశం ఉందన్నారు. పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విద్యాసాగర్, కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, శాస్త్రవేత్తలు బి.రవీందర్, జి.గణేష్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన మత్స్యకారులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.



శిక్షణ పొందిన మత్స్యకారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేసిన శాస్త్రవేత్తలు

అనుమతిలేని నిర్మాణాలు కూల్చివేత

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాల కూల్చివేతకు ప్రణాళిక విభాగం అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం బైపాస్‌రోడ్డులోని ఓ భవనాన్ని అధికారులు కూల్చివేశారు. ఇదే సమయంలో నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. సాగునీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి సంయుక్త సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. తద్వారా ఏమేరకు ఆక్రమణలు జరిగాయో గుర్తించిన అనంతరం నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



బైపాస్‌రోడ్డులో ఓ భవనాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

ఆస్తిపన్ను వసూళ్లపై కమిషనర్ సమీక్ష

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లపై కమిషనర్ అభిషేక్ అగస్త్య శుక్రవారం సమీక్షించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బిల్‌కలెక్టర్‌వారీగా నిర్దేశించిన లక్ష్యం, ఇప్పటి వరకు వసూలు చేసిన వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం సమయంలో భువన్ సర్వే, మధ్యాహ్నం వేళలో ఆస్తిపన్ను వసూలు చేపట్టాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. పాతబకాయిలున్న వారందరికీ రెడ్‌నోటీసులు జారీ చేయాలన్నారు. ప్రతి బిల్‌కలెక్టర్‌కు మూడు నెలల లక్ష్యాన్ని నిర్దేశించి లక్ష్యాలు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌కు సూచించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ కమిషనర్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని పురస్కరించుకొని భారాస నేతలు నివాళులర్పించారు. నగరంలోని ట్యాంక్‌బండుపై గల ఆయన విగ్రహానికి శుక్రవారం నివాళి అర్పించారు. తెలంగాణ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగశీలి లక్ష్మణ్‌బాపూజీ అని నేతలు కొనియాడారు. భారాస నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, దండా జ్యోతిరెడ్డి, సుబ్బారావు, సుగుణారావు తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ రామచంద్రరావు కొండా లక్ష్మణ్ చిత్రపటానికి నివాళి అర్పించారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న భారాస నేతలు

నేడే గ్రానైట్ సంఘం ఎన్నికలు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ది ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ శనివారం ఖమ్మంలో నిర్వహించనున్నారు. ఇల్లెందురోడ్‌లోని హరిత గార్డెన్స్‌లో పోలింగ్ నిర్వహించి, సాయంత్రం ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. సంఘం అధ్యక్ష పదవికి వేముల రవికుమార్, పాటిబండ్ల యుగంధర్ పోటీ పడుతున్నారు. రవికుమార్ ప్యానల్‌లో ఇప్పటికే ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నికవగా మరొకరు అందరి ఆమోదంతో ఏకగ్రీవమయ్యారు. మిగతా పోస్టులకు రెండు ప్యానల్స్ నుంచి అభ్యర్థులు పోటీలో నిలిచారు. మొత్తం 447 మంది ఓటర్లున్నారు. వారం రోజులుగా రెండు వర్గాల వారు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికల ప్రచారంలో పలో భాల పర్వం ఊపందుకున్నట్లు తెలుస్తోంది. రాత్రి పార్టీలు జోరుగా సాగినట్లు సమాచారం. ఈ ఎన్నికలను కొందరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో ఫలితాలపై ఉత్కంఠ ఏర్పడింది.

పరాయి సొమ్ముతో సోకులు

◆ ఐపీ పెట్టేందుకు సన్నాహాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే



స్త్రీనిధి రుణాలు తిరిగి చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమాల్లో భాగస్వాములైన పలువురు ఆర్పీలకు స్త్రీనిధి సొసైటీ నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన ఆడిట్‌లో వారందరితో చర్చించిన మెప్మా అధికారులు సొంతానికి వాడుకున్న మొత్తాన్ని చెల్లించేందుకు కొంత సమయం ఇచ్చారు. కొందరు వాటిని చెల్లిస్తుండగా కొంతమంది వాటిని చెల్లించలేక ఐపీ పెట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో సుమారు రూ.75 లక్షల వరకు నిధులు పక్కదారి పట్టినట్లు సమాచారం. ఈ మొత్తంలో ముగ్గురు ఆర్పీలు స్త్రీనిధితోపాటు, పొదుపు సంఘాలకు సంబంధించిన రుణ వాయిదాలు సైతం చెల్లించలేదని, వారే వాడుకున్నారని అది కాస్తా ప్రస్తుతం రూ.30 లక్షల వరకు చేరుకున్నట్లు వినికిడి. దీంతో ఆ ఆర్పీలు నిధులను చెల్లించలేక ఐపీ పెట్టేందుకు సిద్ధమవుతున్నారని ప్రచారం జరగడంతో ఆయా సమాఖ్యల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వారు ఐపీ పెడితే సభ్యులు, సంఘాల పరిస్థితి ఏమిటన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది.

స్వయం ఉపాధి రుణాలు పక్కదారి

పుర, నగర పాలకాల్లో ఉన్న స్వయం సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు, ఉపాధి అవకాశాలు పొందేందుకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తారు. బ్యాంకు లింకేజీ, వ్యక్తిగత రుణాలను బ్యాంకుల ద్వారా పొందుతుండగా స్త్రీనిధి రుణాలను బ్యాంకులతో సంబంధం లేకుండా తీసుకునే వెసులుబాటు ఉంది.

రూ.75 లక్షలు గోల్‌మాల్

స్త్రీనిధి కింద తీసుకున్న రుణాలను సంఘాల సభ్యులు చెల్లిస్తుండగా కొందరు ఆర్పీలు, ఓబీలు వాటిని ఇష్టారాజ్యంగా వాడుకున్నారు. గత నాలుగేళ్లుగా ఖమ్మం నగరపాలక సంస్థలో 12 మంది ఆర్పీలు రూ.75 లక్షల మేరకు తమ సొంతాలకు వాడుకోగా, కొంత మంది చెల్లింపులు ప్రారంభించారు.

వ్యక్తిని కుటుంబంతో కలిపిన అన్నం సేవా సంస్థ

ఖానాపురం హవేలి, న్యూస్‌టడే: మతిస్థిమితం కోల్పోయి.. పొరుగు రాష్ట్రం వచ్చిన ఓ వ్యక్తిని బాగుచేసి అతని కుటుంబసభ్యుల చెంతకు అన్నం సేవాసంస్థ చేర్చింది. వివరాలను పరిశీలిస్తే.. ఆగస్టు నెలలో ముదిగొండ మండలం బాణాపురం గ్రామ చెరువు వద్ద ఒక మతిస్థిమితం లేని వ్యక్తిని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అతడిని ఆటోలో ఖమ్మంలోని అన్నం సేవా సంస్థకు చేర్చారు. అతనికి సపర్యలు చేసిన అన్నం శ్రీనివాసరావు.. మమత జనరల్ ఆస్పత్రిలోని మానసిక వికలాంగుల వార్డులో చేర్పించి చికిత్స అందించారు. కోలుకున్న అతను తన వివరాలను వెల్లడించారు. తన పేరు అజిత్‌కుమార్ సేనాపతి అని, తాను ఒడిశా రాష్ట్రానికి చెందిన వాడిగా తెలిపారు. పోలీసులు అతని సమాచారాన్ని కుటుంబానికి అందజేశారు. అజిత్‌కుమార్ అన్న శుక్రవారం ఖమ్మం వచ్చి తన తమ్ముడ్ని హత్తుకుని కన్నీటి పర్యంతం అయ్యాడు. ఇంట్లో నుంచి ఎప్పుడో వెళ్లిన వ్యక్తి చనిపోయాడని అనుకున్నామని, తిరిగి మంచి వ్యక్తిగా మార్చి తమకు అప్పగించినందుకు అన్నం సేవా సంస్థకు బాధ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



అజిత్‌కుమార్‌ను కుటుంబసభ్యులతో కలుపుతున్న అన్నం శ్రీనివాసరావు

కార్పొరేషన్ కబుర్లు

★ నగరపాలక సంస్థ కార్యాలయంలో గత నాలుగు రోజులుగా అంతర్జాలం పని చేయకపోవడంతో అన్ని విభాగాల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయాన్నే వచ్చి బయోమెట్రిక్ హాజరు కూడా వేసే అవకాశం లేకుండా పోయింది.

★ నగరంలో పలు డివిజన్లలో మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ రాయితీ పొందుతున్న లబ్ధిదారులకు సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పంపిన లేఖలను వివిధ డివిజన్‌లలో పంపిణీ చేశారు.

★ నగరపాలక సంస్థ పరిధిలో రూ.17 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు టెండర్ ప్రకటన జారీ చేశారు.

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే